నమస్తే తెలంగాణ





# ట్రిపుల్ ట్రబుల్

## భూసేకరణకు ఇబ్బందులు

- పరిహారం పెంచితేనే భూములు ఇస్తామంటున్న రైతులు
- ఎకరం ధర రూ.50 లక్షలుంటే, రూ.12లక్షల పరిహారమా?
- బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం చెల్లించాలని డిమాండ్
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన రైతులు, స్టే విధించిన కోర్టు
- రాష్ట్ర ప్రభుత్వమే చొరవ చూపాలని ఎన్‌హెచ్ఏఐ సూచన


హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్‌రోడ్డు(ట్రిపుల్ ఆర్) ఉత్తరభాగం భూసేకరణలో ప్రతిష్టంభన నెలకున్నది. ప్రభుత్వం ఎకరాకు రూ. 12-15లక్షలు మాత్రమే పరిహారం ఆఫర్ చేస్తుండగా, బహిరంగ మార్కెట్ ధర చెల్లిస్తేనే భూములిస్తామని రైతులు స్పష్టంచేస్తున్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ చేపట్టినందున రాష్ట్ర సర్కారు చొరవ తీసుకోవాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) కోరుతున్నది. సుమారు 162 కిలోమీటర్లమేర ఏర్పాటు చేయనున్న ట్రిపుల్‌ఆర్ ఉత్తరభాగం కోసం 1,950 హెక్టార్ల భూములు అవసరమని ప్రభుత్వం అంచనా వేసింది. భూములు, ఇతర ఆస్తులు కోల్పోయేవారికి రూ.5,100 కోట్ల పరిహారం అందించాల్సి ఉంటుందని గుర్తించింది. దాదాపు 85 శాతం భూసేకరణ పూర్తయింది. పరిహారం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.2,550 కోట్లు చెల్లించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1,250 కోట్లు మాత్రమే కేటాయించింది.

### పరిహారంపై తగ్గేదే లేదు!

ట్రిపుల్‌ఆర్ ఉత్తరభాగంలో భూములు కోల్పోతున్న రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం ముందుగా ఎకరాకు రూ.6 లక్షల చొప్పున ధర నిర్ణయించింది. రైతులు ముందుకురాకపోవడంతో రూ.12లక్షల నుంచి 15లక్షల వరకు ధర నిర్ణయించింది. ఈ ధరకు కూడా రైతులు ససేమిరా అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.40-50 లక్షల వరకు ధర పలుకుతుంటే ప్రభుత్వం రూ.12-15 లక్షల ఇస్తామనడం సరికాదని చెప్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు వదులుకునేదిలేదని తేల్చిచెప్తున్నారు. ఇప్పటికే కొందరు రైతులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు స్టే విధించింది.

### పరిహారం పెంచేదే లేదు!

పరిహారం రైతులు పెంచాలని కోరుతున్నా ప్రభుత్వం పెంచే ప్రతిపాదనలేదని అధికారులు చెప్తున్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల పరిశ్రమల కోసం భూ సేకరణకు నోటిఫికేషన్లు జారీ చేశామని, ట్రిపుల్‌ఆర్‌లో పరిహారం పెంచితే మిగిలిన చోట్ల కూడా పెంచాల్సి వస్తుందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఎన్‌హెచ్ఏఐ పరిహారం మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. రైతులు నిరాకరిస్తే భూసేకరణ చట్ట నిబంధనల మేరకు ఆ సొమ్మును కోర్టులో జమ చేయనున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే టెండర్లు పిలిచిన ఎన్‌హెచ్ఏఐ, 3 నెలలు దాటినా బిడ్లను తెరవలేదు. కోర్టులో కేసులు పరిష్కారమయ్యాకే తదుపరి చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియ ఎప్పుడు కొలిక్కి వస్తుందో, ట్రిపుల్‌ఆర్ పనులు ఎప్పుడు పట్టాలెక్కుతాయో అనేది సందిగ్ధంగా మారింది.




# పైసల్లేవ్.. లేనే లేవ్..!



మొదటిపేజీ తరువాయి...

అందిస్తామంటూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. కొద్దిరోజుల్లోనే ఆ మార్కును చూపించింది. కొత్త ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి రాష్ట్ర ఆర్థిక ప్రగతి సూచీల పరుగులకు బ్రేకులు మొదలయ్యాయి. నెమ్మదించిన పెట్టుబడులు, మందగించిన వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు, ఆయా రంగాల్లో క్షీణించిన వృద్ధి రేటు, కుదేలైన నిర్మాణ-దాని అనుబంధ రంగాలు, నీరసించిన వ్యాపార-పారిశ్రామిక కార్యకలాపాలు, దూరమైన ఉద్యోగ-ఉపాధి అవకాశాలు, పెరిగిన అప్పుల భారం, తరిగిపోతున్న ఆదాయ వనరులు, మార్కెట్‌ను ఆవహించిన నిస్తేజం, పడకేసిన ఉత్పత్తి, ఆగిన సంక్షేమం.. ఇలా చెప్పుకొంటూపోతే మార్పులు అనేకం. అధికారిక గణాంకాలే ఇందుకు నిదర్శనం. నిజానికి బడ్జెట్ సందర్భంగా జీఎస్టీ వసూళ్లలో 12.3 శాతం వృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. అయితే వాస్తవ గణాంకాలు 5.5 శాతాన్ని మించి వృద్ధిని ఆశించకూడదంటున్నాయని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి హరీశ్ రావు ఆనాడే చెప్పారు. చెప్పినట్టుగానే గత ఆర్థిక సంవత్సరం రాష్ట్ర జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 5.1 శాతంగానే నమోదైంది. ఆర్థికపరమైన అంశాల్లో రేవంత్ సర్కారు డొల్లతనానికి ఇది నిదర్శనంగా నిలుస్తున్నది. గత ప్రభుత్వంపై అక్కసుతో నాటి అభివృద్ధిని నిందిస్తున్న నేటి పాలకులు.. వ్యక్తిగత వైషమ్యాలను వీడి, ప్రజా శ్రేయస్సు కోసం ప్రత్యర్థులు చూపిన మంచిని సైతం స్వీకరించాలన్న కనీస రాజనీతిని విస్మరిస్తుండటం నిజంగా పెద్ద తప్పిదమే.

- 2024 మార్చిలో తెలంగాణ జీఎస్టీ వసూళ్లు రూ.5,399 కోట్లు. 2025 మార్చిలో రూ.5,401 కోట్లు. వృద్ధి రేటు సున్నా.
- గత ఆర్థిక సంవత్సరం (2024-25) రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు రూ.62,987 కోట్లుగా నమోదు. 2023-24తో పోల్చితే 5.1 శాతం పెరుగుదల. జాతీయ సగటు 10 శాతంతో పోల్చితే తక్కువే.
- 2024-25కుగాను జీఎస్‌డీపీ అంచనాలో దేశంలోని టాప్-10 రాష్ట్రాల జాబితాలో దిగజారిన తెలంగాణ ర్యాంక్. రూ.16.50 లక్షల కోట్లతో 8వ ర్యాంక్‌కు పరిమితం.
- జీఎస్‌డీపీ, జీడీపీ తలసరి ఆదాయం, జీఎస్టీ వసూళ్లు, మార్కెట్ డిమాండ్, కన్జ్యూమర్ పర్చేజింగ్ పవర్ ఇండెక్స్‌ల్లో రాష్ట్ర పరిస్థితి పేలవం.
- గత బీఆర్‌ఎస్ హయాంలో సంక్షేమ పథకాల అమలుతో పెరిగిన రాష్ట్ర ప్రజల కొనుగోలు శక్తి. నాడున్న అధిక డిమాండ్‌తో ద్రవ్యోల్బణం పెరుగుదల సహజమేనంటున్న నిపుణులు.
- నేటి కాంగ్రెస్ పాలనలో కుంటుబడిన సంక్షేమంతో తగ్గిన ప్రజానీకం కొనుగోలు శక్తి. గ్రామీణ ప్రాంతాల్లో పైసల్లేక మరీ అడుగంటిన డిమాండ్, పర్చేజింగ్ పవర్.
- రాష్ట్రంలో ఏడాదిన్నరగా నిస్తేజంలోనే నిర్మాణ రంగం. హైదరాబాద్‌లో గణనీయంగా తగ్గుతున్న ఇండ్ల అమ్మకాలు.
- కార్పొరేట్ కంపెనీలూ ఆఫీస్ స్పేస్ లీజింగ్‌కు దూరం. పెద్ద ఎత్తున పేరుకుపోతున్న ఇన్వెంటరీలు. మొదలు కాని కొత్త ప్రాజెక్టులు.
- రిటైల్, ఆటో, రియల్ ఎస్టేట్ రంగాల్లో అంతంతమాత్రంగానే విక్రయాలు.
- పెరగని ఉద్యోగ-ఉపాధి అవకాశాలు, జీతభత్యాలు. కొత్త నియామకాలకు ఆసక్తి చూపని కంపెనీలు.

### ఇలాగైతేనే మళ్లీ గాడిలోకి..

మార్కెట్‌లో పడిపోయిన డిమాండ్‌ను తిరిగి పెంచాలంటే.. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడమే సులువైన మార్గం. అయితే ఇందుకు ప్రభుత్వం అనుసరించాల్సినవి కొన్ని ఉన్నాయి. వాటిలో ప్రజానీకం చేతికి మరింతగా నగదు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ప్రభుత్వ సంస్థల్లో, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగ-ఉపాధి అవకాశాలను పెంచాలని, రుణ లభ్యతను పెంపొందించాలని కూడా వారు సూచిస్తున్నారు. రైతు భరోసాసహా అనేక సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని, పెట్టుబడులను ఆకర్షించే నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే నిర్మాణ, దాని అనుబంధ రంగాల కార్యకలాపాలను ఉత్సాహపర్చాలని పేర్కొంటున్నారు. సులభతర వ్యాపార, వాణిజ్య విధానాలను అమలు చేయాలని, కర్మాగారాల ఏర్పాటుకు పెద్దపీట వేయాలని కూడా గుర్తుచేస్తున్నారు. అప్పుడే రాష్ట్ర జీడీపీ పెరిగి, జీఎస్టీ వసూళ్లు ఊపందుకుంటాయంటున్నారు. నిజానికి గత పదేండ్లలో అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు ఈ విషయాల్లో ఆసక్తిని చూపడం వల్లే పాలన, ప్రభుత్వం సజావుగా నడిచాయన్నది మరువద్దు.

## కేసీఆర్ పాలనే భేష్

**మార్కెట్‌లో** డిమాండ్ పడిపోవడం వల్లే రాష్ట్రంలో ద్రవ్యోల్బణం తగ్గింది. మార్చి నెలలో దేశంలోనే అత్యంత కనిష్ఠంగా తెలంగాణలో ద్రవ్యోల్బణం 1.06 శాతంగా ఉన్నది. కేరళలో అత్యధికంగా 6.59 శాతంగా నమోదైంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకోవడం బాధాకరం. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం తగ్గడానికి మా పాలనే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటుండటం ఇంకా విడ్డూరం. అయితే ఇదంతా అబద్ధం. అసలు విషయం ఏమిటంటే డిమాండ్ లేక ద్రవ్యోల్బణం లేదు. ప్రజల కొనుగోలు శక్తి పతనం కావడం వల్ల సరకుల ధరలు పెరగడానికి అవకాశం లేకుండాపోయింది. నిజానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటే అన్ని వస్తూత్పత్తుల ధరలు నెమ్మదిగా పెరుగుతూపోతాయి. డిమాండ్-సప్లై సిద్ధాంతం ప్రకారం కొనేవారు ఎక్కువగా ఉన్నప్పుడు సరకుల సరఫరా ఆ మేరకు లేకుంటే మార్కెట్‌లో బ్యాలెన్స్ తప్పి వాటి ధరలు క్రమేణా పెరుగుతాయి. తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం కొంత ఎక్కువగానే ఉండేది. అయితే దీని ప్రాతిపదికనే ఇప్పటి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో ధరలు తగ్గుముఖం పట్టాయని ప్రచారం చేసుకుంటున్నది. కానీ బీఆర్‌ఎస్ హయాంలో గ్రామీణ ప్రజల దగ్గర పైసలుండేవి. వ్యవసాయం బాగుండేది. రైతుబంధు, రైతుబీమా, కల్యాణ లక్ష్మి.. ఇలా రకరకాల పథకాలతో ఆ రోజుల్లో జనాల దగ్గర, పుష్కలంగా నగదు చలామణి కనిపించేది. నాటి ప్రభుత్వం సంక్షేమ పథకాలను తప్పకుండా అమలు చేయడమే ఇందుకు కారణం. కాబట్టి అధిక కొనుగోలు శక్తితో డిమాండ్ ఎక్కువగా ఉండి, అప్పట్లో తెలంగాణలో ద్రవ్యోల్బణం కూడా ఆ మేరకు ఎక్కువగానే ఉండేది. కానీ ఇప్పుడు సంక్షేమం కుంటుబడింది. దీంతో అందరి కొనుగోలు శక్తీ తగ్గిపోయింది. అయినప్పటికీ దీన్ని నేటి ప్రభుత్వ పెద్దలు గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటు. రైతుబంధును రైతు భరోసాగా మార్చిన దగ్గర్నుంచి రైతన్నలకు పంట సాయమే కరువైపోయింది. చాలా పథకాలదీ ఇదే దుస్థితి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో జీవనాధారమైన వ్యవసాయం చితికిపోయి.. ఎవ్వరి చేతుల్లోనూ పైసల్లేకుండాపోయాయి. ఇలా ప్రజల కొనుగోలు శక్తి పతనం కావడం వల్లే ద్రవ్యోల్బణం తగ్గింది. అంతేగానీ ఇందులో రేవంత్ సర్కారు గొప్పతనమేమీ లేదు.

రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ప్రతికూలమే. ఇటీవల విడుదలైన రాష్ట్రాల జీడీపీ అంచనా గణాంకాల్లో తెలంగాణ ర్యాంకు పడిపోయింది. తలసరి ఆదాయంలోనూ ఇదే దుస్థితి. ఇంకోవైపు మార్చి నెలలో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి సున్నాగా మిగిలింది. దేశంలోని ప్రధాన రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న తెలంగాణలో ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఎందుకంటే ప్రజల కొనుగోలు శక్తికి జీఎస్టీ కూడా ఓ కొలమానమే. మార్కెట్ లావాదేవీలకు జీఎస్టీ ఓ సూచిక. అలాంటి జీఎస్టీ వసూళ్లలో వృద్ధి లేదంటే మార్కెట్ నిస్తేజంలోకి జారుకున్నట్టే. ఇంకా లోతుగా చెప్పాలంటే కరోనా తర్వాత ఇలాంటి పరిస్థితి తలెత్తడం ఇదే తొలిసారి. వాస్తవానికి కరోనా ప్రభావం నుంచి రాష్ట ఆర్థిక వ్యవస్థ త్వరగా కోలుకోవడానికి అప్పటి సీఎం కేసీఆర్ కూడా ఓ కారణమే. నాడు ఒకేసారి రూ.8,000 కోట్లతో ధాన్యం కొనుగోలు చేయడం బాగా కలిసొచ్చింది. ఇప్పుడిలాంటి ప్రోత్సాహకర నిర్ణయాలే కానరావడం లేదు. అప్పట్లో తెలంగాణలో మాదిరే ప్రస్తుతం కేరళలో సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందుతున్నాయి. అందుకే అక్కడి ప్రజల కొనుగోలు శక్తి ఎక్కువగా ఉన్నది. మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది కాబట్టే ద్రవ్యోల్బణం కూడా ఎక్కువ. ఇది అర్థంకాని తెలంగాణ ప్రభుత్వం.. ద్రవ్యోల్బణం తగ్గుదలను ఓ ఘనతగా చూస్తున్నది. ఇప్పటికైనా కండ్లు తెరవకపోతే ముప్పు తప్పదు. అప్రమత్తంగా లేకపోతే సంక్షోభం ఖాయమే.



డీ పాపారావు
ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు

# అమ్మకానికి న్యాక్ భూములు?

మొదటిపేజీ తరువాయి...

ఉద్దేశించిన ఈ సంస్థను కనుమరుగు చేసేందుకు ప్రభుత్వం చాపకింద నీరులా పావులు కదుపుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. నిర్మాణ రంగానికి అవసరమైన నిపుణులను తయారుచేసేందుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 1998లో న్యాక్‌ను ఏర్పాటుచేసింది. ముఖ్యమంత్రి చైర్మన్‌గా, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైస్ చైర్మన్లుగా, వివిధ శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులు బోర్డు సభ్యులుగా కార్యనిర్వాహక మండలిని ఏర్పాటుచేశారు. సుమారు 167 ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణంలో నోవాటెల్ హోటల్, హైటెక్ ఎగ్జిబిషన్ కన్వెన్షన్ సెంటర్, న్యాక్ తదితర వాటిని ఏర్పాటుచేశారు. ఇందులో సుమారు 15 ఎకరాలను గతంలో హ్యుండాయ్ కంపెనీకి విక్రయించారు. కాగా, న్యాక్ భవనం సహా దాని ఆధీనంలో సుమారు 60 ఎకరాల వరకు స్థలం ఉన్నది. ఇందులో ఐదు ఎకరాల స్థలాన్ని గతంలో క్విప్పో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ కంపెనీకి లీజుకి ఇచ్చారు. ఇందులో ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉండటంతో సదరు కంపెనీ నష్టాలు వచ్చాయంటూ ప్రభుత్వానికి పైసా కూడా చెల్లించకుండా 'నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్' (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించింది. దీంతో కేసీఆర్ ప్రభుత్వం వారికి కేటాయించిన భూములను, భవనాన్ని సీజ్ చేసి న్యాక్ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది.

### ఇదివరకే భూములను పరిశీలించిన మంత్రి

మరోవైపు, న్యాక్‌లో కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాల కోసం హైటెక్‌సిటీ ప్రాంతంలోని ఎంతో విలువైన భూములు, భవనాలు అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా, భూములు ఖాళీగా ఉంటే అన్యాక్రాంతమవుతాయని, నకిలీపత్రాలను సృష్టించి న్యాయస్థానాలను ఆశ్రయిస్తారని, అందుకే తామే భూములను విక్రయించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు సుమారు ఆరు నెలల క్రితమే న్యాక్ ఆధీనంలోని భూములు, అక్కడ కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాలు, న్యాక్ అవసరాలు తదితర అంశాలతో కూడిన సమగ్ర సమాచారంతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అంతేకాదు, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి స్వయంగా న్యాక్‌ను సందర్శించి అక్కడి భూములను పరిశీలించి వచ్చారు. ప్రస్తుతం ఉన్న న్యాక్ భవనాన్ని కూడా తొలగిస్తే దాదాపు 60 ఎకరాల భూమి అందుబాటులోకి వస్తుందని అంచనా వేశారు. అక్కడ ఎకరం భూమి ధర రూ.100 కోట్లకుపైగా ఉండటంతో మొత్తం న్యాక్ భవనాన్ని కూడా తొలగించి 60 ఎకరాలు విక్రయిస్తే రూ.6,000 కోట్లకుపైగా నిధులు సమకూరుతాయని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. న్యాక్ భవనాన్ని కూడా తొలగించి, అవసరమైతే ఔటర్ రింగురోడ్డు సమీపంలో న్యాక్ కోసం కొత్త భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

### న్యాక్‌ను జిల్లాలకు విస్తరించిన కేసీఆర్ సర్కారు

**నిర్మాణరంగంలో** వస్తున్న మార్పులు, ఆధునిక పద్ధతులపై ఎప్పటికప్పుడు కార్మికుల నుంచి చీఫ్ ఇంజినీర్ల వరకు అవగాహన కల్పించేందుకు న్యాక్‌లో నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తారు. దేశ విదేశాలకు చెందిన ప్రఖ్యాతిగాంచిన ఇంజినీరింగ్ కాలేజీలు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు, పరిశోధనా సంస్థలు, ప్రఖ్యాతిగాంచిన నిర్మాణ సంస్థల ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తారు. నిర్మాణ రంగం కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం.. న్యాక్ వంటి శిక్షణా సంస్థలను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా వివిధ జిల్లాల్లో సైతం ఏర్పాటుచేసింది. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుండటంతో నిర్మాణ రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా కేసీఆర్ సర్కారు తగిన ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం న్యాక్ భూములను విక్రయించి దానికి ప్రాధాన్యం లేకుండా చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### క్లియర్‌గా ఉన్న భూములపై నజర్

ఇటీవల హెచ్‌సీయూ భూముల వ్యవహారం వివాదాస్పదం కావడంతో ప్రభుత్వం క్లియర్ టైటిల్ భూములపై కన్నేసినట్టు తెలిసింది. ఎటువంటి వివాదాలు లేకుండా, ఎవ్వరూ జోక్యం చేసుకునే అవకాశం లేని భూములను గుర్తించి విక్రయించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నట్టు, సమాచారం లీక్ కాకుండా అధికారులకు గట్టి హెచ్చరికలు పంపినట్టు తెలిసింది. న్యాక్‌కు కేటాయించిన భూముల్లో ఎటువంటి లిటిగేషన్లు వచ్చే అవకాశం లేదని, అందుకే న్యాక్ భూములను విక్రయించాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చిందని సమాచారం.



# అగ్నిమాపకశాఖలో రోబోల సేవలు

- ఫ్రాన్స్ నుంచి రూ.6 కోట్లతో 3రోబో ఫైటర్స్ కొనుగోలు
- ఒక్కసారి చార్జ్ చేస్తే.. 6 గంటలపాటు నాన్‌స్టాప్‌గా ఫైటింగ్
- 900 డిగ్రీల వేడిని తట్టుకుని సేవలు అందించనున్న రోబోలు
- మొదట హైదరాబాద్, రంగారెడ్డి, పటాన్‌చెరు స్టేషన్లలో వినియోగం

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా ప్రతీశాఖలో నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారు. అయితే ప్రతీ వేసవికాలంలో తరచూ అగ్ని ప్రమాదాల వల్ల భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తున్నాయి. కొన్ని సమయాల్లో అగ్ని ప్రమాద తీవ్రత వల్ల అక్కడకు ఫైర్ సిబ్బంది వెళ్లలేకపోవడంతో నష్టం తీవ్రత పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రత్యేక దృష్టిసారించిన తెలంగాణ అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ.. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వినియోగిస్తున్న 3 ఫైర్ ఫైటింగ్ రోబోలను సుమారు రూ.6 కోట్లతో ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసింది. ఈ రోబోలను ఒక్కసారి చార్జ్ చేస్తే.. సుమారు 6 గంటలు నాన్‌స్టాప్‌గా ఫైర్ ఫైటింగ్ చేస్తాయి. అంతేకాకుండా సుమారు 900 డిగ్రీల వేడిలో కూడా ఇవి తమకు తాము నీటిని స్ప్రే చేసుకుంటూ మంటలను ఆర్పుతాయి. ముఖ్యంగా ఫైర్‌ఫైటర్స్ వెళ్లలేని ప్రాంతాలు, ఎత్తైన భవనాలు, పరిశ్రమల్లో సైతం ఇవి ఫైర్ ఫైటింగ్ చేస్తాయి. కాగా, వీటిని ఎలా ఆపరేట్ చేయాలనే అంశంపై కంపెనీ ప్రతినిధులతో అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇప్పించిన అనంతరం వాటిని హైదరాబాద్, రంగారెడ్డి, పటాన్‌చెరు వంటి అగ్నిమాపక కేంద్రాలకు పంపనున్నారు. ఇక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఫైర్ స్టేషన్లు, మరికొన్ని పాత ఫైర్ స్టేషన్ల కోసం కొత్తగా 18 ఫైర్ టెండర్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఇవి ఫిట్టింగ్ దశలో ఉన్నాయి. అవి పూర్తయితే మేడ్చల్-మల్కాజిగిరి, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, అంబర్‌పేట, రాజేంద్రనగర్, షాద్‌నగర్, అలంపూర్, మక్తల్, స్టేషన్ ఘన్‌పూర్, నర్సాపూర్, హుస్నాబాద్, డోర్నకల్, కల్వకుర్తి, పినపాక, బాల్కొండ, ధర్మపురి, నందిపేటలకు పంపించే అవకాశం ఉన్నట్టు సమాచారం. వీటితోపాటు నగర వీధుల్లో సులువుగా భవనాల వద్దకు వెళ్లగలిగే మినీఫైర్ వాహనాలు, మల్టీ ఆర్టిక్యులేటెడ్ వాటర్ టవర్‌ను సుమారు రూ.6 కోట్లతో కొనుగోలు చేశారు. దీంతో నగరంలో ఎక్కడ ఏ అగ్ని ప్రమాదం జరిగినా.. వీటి ద్వారా నియంత్రించగలమని అధికారులు చెప్తుతున్నారు.

### పౌరుల రక్షణే మా బాధ్యత

విపత్తులు సంభవించినప్పుడు పౌరుల ప్రాణాలు, ఆస్తులను కాపాడటం కోసం రాష్ట్ర అగ్నిమాపకశాఖ అహర్నిశలు కృషి చేస్తున్నది. నిరుడుతో పోల్చితే అగ్నిప్రమాదాలు పెరుగుతున్నందున ఈ వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇండ్లలో ప్రమాదవశాత్తూ సంభవించే అగ్నిని ఆర్పడంపై అవగాహన పెంచుకోవాలి. ఈ 'ఫైర్ వీక్' అగ్నిమాపక సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. నిర్లక్ష్యంగా సిగరెట్ కాల్చి పడేస్తుండటం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫైర్ సిబ్బందికి మంటలు అదుపు చేయడంలోనే మాత్రమే కాకుండా ఇతర రెస్క్యూ అంశాల్లోనే ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాం. **- వై నాగిరెడ్డి, అగ్నిమాపకశాఖ డీజీ**

# ..బ్యాంకు సమ్మతిస్తేనే

మొదటిపేజీ తరువాయి...

యువకులకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా రూ.6,000 కోట్లతో రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభించింది. ఈ నెల 14 వరకు దరఖాస్తులను స్వీకరించగా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16 లక్షల మందికిపైగా వివిధ యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నది. జూన్ 2న నిర్దేశిత లక్ష్యం మేరకు రుణాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

### సిబిల్ స్కోర్ మెలిక!

సబ్సిడీ రుణాల మంజూరులో బ్యాంకు అధికారులే కీలకపాత్ర పోషించనున్నారు. దరఖాస్తులను తొలుత మండల స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. ఈ కమిటీలో ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, కలెక్టర్ నియమించిన ప్రత్యేక అధికారి, బ్యాంకు మేనేజర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ కార్పొరేషన్ల ప్రతినిధులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు ఉండనున్నారు. ఇతర అధికారులకన్నా బ్యాంకు అధికారే ఈ కమిటీలో కీలకంగా ఉంటారు. పాన్, ఆధార్‌కార్డులతోపాటు బ్యాంకు వివరాలను దరఖాస్తు సమయంలోనే సేకరించారు. వాటి ఆధారంగా దరఖాస్తుదారుడి సిబిల్ స్కోర్ (రుణ పరపతి) ఎలా ఉందనేది పరిశీలిస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు సిబిల్‌స్కోర్ ఉండి, బ్యాంకు అధికారి సంతృప్తి చెందితేనే రుణం మంజూరుకానున్నది. లేదంటే సబ్సిడీ రుణం అందకుండా పోతుంది. గతంలో ఏవైనా రుణాలను తీసుకుని సక్రమంగా చెల్లించని వారి, సిబిల్‌స్కోర్ లేని వారికీ రుణం దక్కడం అనుమానమే. బ్యాంకర్ల ఆమోదంతోనే మండల కమిటీ లక్షిత యూనిట్ల మేరకు అర్హుల జాబితాను సిద్ధం చేసి జిల్లాస్థాయి కమిటీకి పంపుతుంది.

### 10-12 శాతం వడ్డీ

రాజీవ్ యువవికాసం పథకం కింద ఇచ్చే సబ్సిడీ రుణాన్ని కూడా 10 నుంచి 12 శాతం వడ్డీతోనే మంజూరు చేయనున్నారు. నిర్ణీత వాయిదాల్లో అసలు, వడ్డీని కలిపి లబ్ధిదారుడు తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కేవలం రూ.50 వేల యూనిట్ మాత్రమే 100 శాతం సబ్సిడీతో అందిస్తున్నది. మిగతా రుణాల్లో ప్రభుత్వం సబ్సిడీపోను, మిగతా సొమ్మును బ్యాంకు రుణంగా అందజేయనున్నది. ఉదాహరణకు రూ.4 లక్షల యూనిట్‌లో రూ.2.80 లక్షలను ప్రభుత్వం, మిగతా రూ.1.20 లక్షలను బ్యాంకు రుణంగా అందివ్వనున్నది. ఆ రుణ మొత్తానికి 10-12 శాతం వడ్డీని ఆ బ్యాంకు వసూలు చేయనున్నది. ఈ విషయంపై బ్యాంకు అధికారులను సంప్రదిస్తే తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు, మార్గదర్శకాలు లేవని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలోనే వ్యక్తిగత రుణాలను మంజూరు చేసినప్పుడు విధించే వడ్డీ చార్జీలనే వర్తింపజేస్తున్నామని వివిధ బ్యాంకుల అధికారులు తెలిపారు.

### గతంలో చేదు అనుభవాలు

ఈ రాజీవ్ యువవికాసం పథకం తరహాలోనే గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు ఆయా వర్గాలకు సబ్సిడీ రుణాలను మంజూరు చేసేవి. ఈ బ్యాంకు లింకేజీ రుణాల్లో అనేక సమస్యలు ఎదురయ్యాయి. ప్రధానంగా లబ్ధిదారులు బ్యాంకులు మంజూరు చేసిన రుణాలను తిరిగి చెల్లించని పరిస్థితి నెలకొన్నది. ఫలితంగా బ్యాంకులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో బ్యాంకులు సైతం లింకేజీ రుణాల మంజూరుకు నిరాసక్తత చూపుతూ వచ్చాయి. దీంతో రుణాల మంజూరు మందకొడిగా కొనసాగేది. ఈ నేపథ్యంలోనే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లింకేజీ రుణాలకు స్వస్తి పలికింది. బ్యాంకులతో సంబంధం లేకుండా 100 శాతం సబ్సిడీతో వృత్తిదారులు, ఆయా వర్గాలకు స్వయం ఉపాధికి బాటలు వేసింది. అందులో భాగంగా బీసీబంధు, మైనార్టీ బంధు తదితర పథకాలను విజయవంతంగా అమలు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం మళ్లీ బ్యాంకు లింకేజీ రుణాలనే అందించేందుకు మొగ్గుచూపింది. కానీ రుణాల మంజూరుకు పలు బ్యాంకులు మాత్రం ఇప్పటికే నిరాసక్తత చూపుతున్నట్టు తెలుస్తున్నది.

# సంక్షేమ భవన్ ముట్టడి

- సీఎంఎస్టీఈఐ, ఓవర్సీస్ పథకాలు నిర్వీర్యం
- గిరిజనులను దగా చేస్తున్న కాంగ్రెస్
- బీఆర్‌ఎస్వీ రాష్ట కార్యదర్శి శ్రీనునాయక్ ఆందోళన



హైదరాబాద్, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన యువతను దగా చేస్తున్నదని, గత ప్రభుత్వం అమలు చేసిన ప్రతిష్ఠాత్మక పథకాలను నిర్వీర్యం చేస్తున్నదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనునాయక్ మండిపడ్డారు. గిరిజన నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మాజీ సీఎం కేసీఆర్ నిరుడు సీఎంఎస్టీఈఐ, విదేశాల్లో ఉన్నత చదువుల కోసం ఓవర్సీస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఆ పథకాల బకాయిలను విడుదల చేయకుండా నిర్వీర్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను లబ్ధిదారులు, గిరిజన సంఘం నాయకులతో కలిసి బీఆర్‌ఎస్వీ నేతలు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం గిరిజన విద్యార్థులు, నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో 2020లో సీఎంఎస్టీఈఐ (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ అంత్రాపెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్) పథకాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. రాత పరీక్ష ద్వారా గిరిజన యువతను ఎంపిక చేసి బెంగుళూరులోని ఇండియన్ స్కూల్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో 6నెలలపాటు శిక్షణ అందించేవారని వివరించారు. ఆ తరువాత కంపెనీ ఏర్పాటుకు రూ.కోటి రుణ సదుపాయాన్ని కల్పించేవారని, ఆ ఈ కోటిలో రూ.50 లక్షలు బ్యాంకుల ద్వారా, మరో రూ.50 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించేదని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022- 23లో 200 మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ముట్టడి విషయం తెలుసుకున్న పోలీసులు సంక్షేమ భవన్ చేరుకుని బీఆర్‌ఎస్వీ నేతలను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.